క్లుప్తంగా

నేడు మెగా జాబ్ మేళా

రొంపిచెర్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మెగా జాబ్ మేళా జరుగుతుందని ఎంపీడీఓ రాజేంద్ర, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేణిగుంటలోని ఓ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేస్తారన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ, ఇంజినీరింగ్ అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. 18–28 ఏళ్ల మహిళలు మాత్రమే అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.13 వేల నుంచి రూ.16 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా బాటగంగమ్మ జాతర


ధర్మపురి బాటగంగమ్మ

బైరెడ్డిపల్లె: మండలంలోని ధర్మపురి గ్రామంలో శనివారం రాత్రి బాట గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. గ్రామ పొలిమేరల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి గ్రామ పురవీధుల మీదుగా ఊరేగించారు. ఆదివారం ఉదయం ఆలయం వద్ద ప్రతిష్టించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు సుభిక్షంగా ఉండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పలమనేరు: పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో అదే పాఠశాలకు చెందిన 1968 బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్థానిక లయన్స్‌క్లబ్ సభ్యులతో కలిసి ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పీఈఎస్ మెడికల్ కళాశాల కంటి వైద్యులు 65 మందికి కంటి పరీక్షలు చేసి 22 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు నిర్వాహకుడు పూసల రవి తెలిపారు. కార్యక్రమంలో చంద్రయ్యశెట్టి, పూహళేంది, రమేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వీర సావర్కర్ జయంతి వేడుకలు


జయంతి వేడుకల్లో బీజేపీ నాయకులు

పలమనేరు: భారత ముద్దుబిడ్డ వీరసావర్కర్ 140వ జయంతి వేడుకలను స్థానిక బీజేపీ నాయకులు ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. పార్టీ నేతలు తాతయ్యానాయుడు, వీరభద్రగౌడు, మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర


గంటావూరులో అమ్మవారి విశ్వరూపం

పలమనేరు: మండలంలోని మండిపేటకోటూరు, గంటావూరులో ఆదివారం గంగమ్మ జాతర ఘనంగా జరిగాయి. గంటావూరులో ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరై అమ్మవారికి పూజలు చేశారు. గ్రామస్తులు గంగమ్మకు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పిడుగుపడి కొబ్బరి చెట్టు దగ్ధం


కాలిపోతున్న కొబ్బరి చెట్టు

బైరాల: మండలంలోని వినాయకపురంలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు బలంగా వీచాయి. చిన్నపాటి వర్షం కురిసింది. ఉరుములకు గోవర్ధన్‌రెడ్డి ఇంటి పక్కన ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడి చెట్టు పూర్తిగా కాలిపోయింది. ఈ దృశ్యాన్ని కొందరూ వీడియోలో చిత్రీకరించారు.

ఇంటింటా సంక్షేమ కాంతులు

- నాలుగేళ్లలో ప్రతి గడపలో లబ్ధి
- వైఎస్ జగన్‌తోనే అందరి సంక్షేమం
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ


సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: నాలుగేళ్లలోనే ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేర్చిన ఘనత తమ ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. ఆదివారం మండలంలోని రాగిమాకులపల్లి, కడపల్లి ఎస్టీ కాలనీ, గొాదమాకులపల్లి, చల్లావారిపల్లి, తిరుమలకొండయ్యగారిపల్లి, బొంతలవారిపల్లిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. 385 గృహాలను సందర్శించి నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. ప్రజా సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తమ ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సుమారు రూ.2.10 లక్షల కోట్లు డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాలోకి జమ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో నాయీ బ్రాహ్మణులు, చేనేత కార్మికులు, మత్స్యకారులను పట్టించుకున్న నాథుడే లేదన్నారు. అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకార భరోసా, నేతన్న నేస్తం, చేదోడు, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా తదితర సంక్షేమ పథకాలు పేదలకు అందించారన్నారు. పేద ప్రజలందరూ ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమని, అందు కోసం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. అభివృద్ధిని అడ్డుకుంటున్న టీడీపీకి గుణపాఠం చెప్పాలని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి, సింగల్‌విండో చైర్మన్ ఓబుల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, మండల కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, సింగల్ విండో డైరెక్టర్ క్రిష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు సుహేబ్, మాకయ్య, ఏఎంసీ డైరెక్టర్ సురేష్, సర్పంచ్ కుమారమ్మ, ఎంపీటీసీ సునంద, స్థానిక నాయకులు కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శేషాద్రి రెడ్డి పాల్గొన్నారు.

నేటి కార్యక్రమం

నాగిరెడ్డిపల్లి పంచాయతీ నడింపల్లి, సూరకుంట్ల, నాగిరెడ్డిపల్లి, లింగమనాయనిపల్లి గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి తెలిపారు.

లారీ డ్రైవర్లకు ప్రత్యేక కాలనీ


లారీ డ్రైవర్లకు బీమా సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

పుంగనూరు: లారీ ఓనర్ల అసోసియేషన్, డ్రైవర్ల సంఘానికి బీమా సౌకర్యంతో పాటు 3 ఎకరాల స్థలంలో ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయిస్తామని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం 200 మంది డ్రైవర్లకు బీమా సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ.. చెర్లోపల్లి వద్ద ఆటోమొబైల్ కార్మికులకు కూడా 5 ఎకరాల స్థలం కేటాయించి గృహాలు నిర్మిస్తామన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ ఆఫీసుకు స్థలం కేటాయించామని, త్వరలోనే కార్యాలయం నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎంఎస్.సలీం, డ్రైవర్ల అసోసియేషన్ నేత సిద్దిక్, షా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో శెట్టేపల్లి విద్యార్థిని


ఎన్.అపూర్వ

శాంతిపురం: ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఆదివారం నుంచి జరిగే 42వ జాతీయ షూటింగ్ బాల్ పోటీల్లో శెట్టిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎన్.అపూర్వ రాష్ట్ర జట్టులో ఆడుతున్నట్టు హెచ్‌ఎం తీగల వెంకటయ్య తెలిపారు. అంతర్ జిల్లాల పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి, రాష్ట్రం నుంచి వెళ్లిన 12 మంది బాలికల జట్టులో అపూర్వ చోటు దక్కించుకుందన్నారు. మారుమూల గ్రామమైన శెట్టిపల్లిలోని సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన అపూర్వను ఉత్తమ క్రీడాకారిణిగా తీర్చిదిద్దిన పాఠశాల పీడీ మురళీధర్‌ను ఆయన అభినందించారు.

పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలి


నిరసన వ్యక్తం చేస్తున్న వీసీకే నాయకులు

వి.కోట: నూతన పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలని వీసీకే మండల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నల్లదుస్తులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర కన్వీనర్ గణపతి, బాస్ నాయకులు దాము, జయపాల్, అర్జున్ ప్రసాద్, ప్రవీణ్, కుమార్, బాబు, సురేష్ పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేద్దాం


వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండపాణి

శాంతిపురం: కుప్పంలో సోమవారం తలపెట్టిన బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి కోరారు. ర్యాలీ ఏర్పాట్లపై జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డితో కలిసి ఆదివారం పార్టీ నాయకులతో సమీక్షించారు. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, అభిమానులు ర్యాలీలో పాల్గొనేలా చూడాలన్నారు. వైస్ ఎంపీపీ పట్టాభి, రెస్కో మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, నాయకులు రఘురామిరెడ్డి, ఏపీ జయరాం, నిసార్ పాల్గొన్నారు.

కుప్పం: పట్టణంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ భరత్ ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు బైక్ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ ప్రారంభం


వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: రైతులకు రాయితీతో వేరుశనగ విత్తన కాయల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెంకటేగౌడ వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఇది వరకే పేర్లు నమోదు చేసుకున్న రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి హేమలత తెలిపారు. దండపల్లి ఆర్‌బీకే వద్ద టోకెన్లు పొందిన రైతులకు వేరుశనగ బస్తాలను పంపిణీ చేశారు. ఖరీఫ్‌కి సంబంధించి మండలంలో ఇప్పటి వరకు 2,548 మంది రైతులు 941.1 క్వింటాళ్ల విత్తనాల కోసం నగదు చెల్లించి పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. తహసీల్దార్ అమర్నాథ్, ఎంపీడీఓ శివప్రసాద్, ఎంపీపీ వెంకటరమణ, పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచ్ బీరుగాడు, ఎంపీటీసీ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్‌లకు 32 మంది ఎంపిక


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కుప్పం: సాయిమాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన శారద కంటి ఆస్పత్రి వైద్యులు 190 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 32 మందిని ఆపరేషన్‌లకు ఎంపిక చేశారు. వీరికి బెంగళూరులోని శారద కంటి అస్పత్రిలో ఆపరేషన్ చేయిస్తామని సాయిమాత సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు జగదీష్ బాబు తెలిపారు. వైద్యులు బాబు, మహాదేవ పాల్గొన్నారు.

ప్రపంచ రుతుస్రావ దినోత్సవం


ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం ప్రపంచ రుతుస్రావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, మెప్మా సభ్యులతో కలిసి అవగాహన ర్యాలీ చేశారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మాట్లాడుతూ.. ఇప్పటికీ కొందరికి రుతుస్రావంపై అవగాహన లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మహిళ జీవితంలో రుతుక్రమం ఓ సహజ ప్రక్రియ అని.. దీనిపై అవగాహన పెంచుకుని ఆరోగ్యంగా జీవించాలని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ మాధవి పలు విషయాలను విపులంగా వివరించారు.

నేటి నుంచి వి.కోటలో గంగమ్మ జాతర



వి.కోట: మండల కేంద్రంలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు గంగమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కార్తికేయన్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. సోమవారం అమ్మవారి శిరస్సు, పూలగెరిగ ఊరేగింపు జరుగుతుందన్నారు. మంగళవారం అగ్నిగుండ మహోత్సవం, అమ్మవారి దివ్య దర్శనం ఉంటుందన్నారు.

ఈదురుగాలులకు తీవ్ర నష్టం


బేలుపల్లె వద్ద నేలమట్టమైన కోళ్ల ఫారం


బురిశెట్టిపల్లె వద్ద నేలకొరిగిన వృక్షం

బైరెడ్డిపల్లె: మండలంలోని బురిశెట్టిపల్లె, బేలుపల్లె, బెల్లంమడుగు గ్రామాల్లో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీని ప్రభావంతో బేలుపల్లెకు చెందిన కిశోర్ కోళ్ల ఫారం నేలమట్టమైంది. సుమారు రూ.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. దీంతో పాటు కోత దశలో ఉన్న మామిడి, బీన్స్, టమాట పంటలకు తీవ్రం నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

బుడ్డీ దీపం.. గుడ్డి వైద్యం


ఆస్పత్రిలోని జనరేటర్ ప్లాంట్


అత్యవసర విభాగ ముఖద్వారం

- జిల్లా ఆస్పత్రిలో కరెంటు కష్టాలు
- జనరేటర్ ఉన్నా వెలగని లైట్లు
- అధికారుల్లో స్పందన కరువు

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసేవలకు కరెంట్ అడ్డుపడుతోంది. ఎక్కడైనా కరెంట్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోవడం సాధారణం. ఇక్కడ కరెంట్ లేకపోవడంతో రోగులు మృత్యువాత పడుతుండడం గమనార్హం. విద్యుత్ అంతరాయం ఉన్నప్పుడు ఉపయోగించుకోవ దానికి జనరేటర్ అందుబాటులో ఉంది. అయితే ఆస్పత్రిలోని ప్రధాన విభాగాల్లోని లైట్లకు ఆ జనరేటర్‌కు అనుసంధానం చేయకపోవడం దౌర్భాగ్యం. తాజాగా బుడ్డీ దీపాలు, సెల్‌ఫోన్ టార్చిలైట్ల వెలుతురులో క్షతగాత్రులకు చికిత్స చేయడం శోచనీయం.

చిత్తూరు రూరల్: జిల్లా కేంద్రం నడిబొడ్డున ప్రభుత్వ ఆస్పత్రి ఉంది. చుట్టు పక్కల ఏ ప్రమాదం జరిగినా అత్యవసర చికిత్స కోసం క్షతగాత్రులను ఇక్కడికి తరలిస్తుంటారు. ఇలా రోజూ రోడ్డు ప్రమాదాలకు సంబంధించి 10 నుంచి 15 కేసులు వస్తుంటాయి. అత్యవసర చికిత్స కోసం 100 నుంచి 150 వరకు ఓపీలు నమోదవుతుంటాయి. అయితే అప్పుడప్పుడు ఆస్పత్రిలో కొన్ని కారణాల వల్ల కరెంటు సరఫరా నిలిచిపోతుంది. ఇలాంటప్పుడు అవసరమవుతుందని యూపీఎస్, జనరేటర్‌ను అందుబాటులో ఉంచారు. అయితే వాటిని వినియోగించుకోవడం ఆస్పత్రి అధికారులకు చేతకాకపోవడం విడ్డూరం.

నిండుగా జనరేటర్

కరెంటు కోత సమయాల్లో ఆస్పత్రిలోని అన్ని విభాగాలకు విద్యుత్ సరఫరా చేసే సామర్థ్యం గల జనరేటర్లు ఇక్కడ పుష్కలంగా ఉన్నాయి. రెండు 160 కేవీఏ, 200 కేవీఏ, 40 కేవీఐ, 50 కేవీఏలు ఒకటి చొప్పున అందుబాటులో ఉన్నాయి. దీంతోపాటు ఓపీడీ బ్లాక్‌లో 80 కేవీఏ, పాత ఐపీ బ్లాక్ 40 కేవీఏ, కొత్త ఐపీ బ్లాక్‌లో 60కేవీఏ, ఎంఆర్ఐ బ్లాక్‌లో 12 కేవీఐ యూపీఎస్‌లు వాడకంలో ఉన్నాయి. ఇవి సామర్థ్యాన్ని బట్టి కొన్ని గంటల వరకు మాత్రమే పనిచేస్తాయి. ఎక్కువ సమయం పాటు కరెంటు కోత పడితే తప్పకుండా జనరేటర్ అవసరమవుతోంది. ఇలాంటప్పుడు జనరేటర్ నిర్వహణలో నిర్లక్ష్యం తాండవిస్తోంది. కరెంటు పది నిమిషాల్లో వచ్చేస్తుందని ఆస్పత్రి నిర్వాహకులు జనరేటర్ ఆన్ చేయకుండా కాలం వెళ్లదీయడం అత్యంత దుర్మార్గం. 160 కేవీఏ జనరేటర్‌ను నడపాలంటే 50 నుంచి 60 లీటర్ల డీజిల్, 200 కేవీఏకు 30 నుంచి 40 లీటర్ల డీజిల్ అవసరమవుతోందని, అందుకే జనరేటర్ వాడకంలో కాస్త ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

తాజా ఘటనలో..

వరిగపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పారిశుధ్య కార్మికులు ఇద్దరు తీవ్రంగాగా గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తీసుకు వచ్చిన సమయంలో పవర్ కట్ అయింది. యూపీఎస్ కొంత సేపటి వరకు మాత్రమే వెలుగునిచ్చింది. ఆ తర్వాత డాక్టర్లు మొబైల్ ఫోన్‌లైట్ ద్వారా క్షతగాత్రులకు చికిత్స అందించాల్సి వచ్చింది. ఆ బుడ్డీ దీపాల వెలుగులోనే గాయాలకు కుట్టు వేయడం గమనార్హం. ఈ తరువాత విధిలేక వేలూరు సీఎంసీకి రెఫర్‌చేశారు.

ఆస్పత్రిలో చీకటి కష్టాలు

విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతు, నిర్వహణ కోసం శనివారాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తుంటారు. వర్షాల సమయంలో కరెంటు తీగలపై చెట్లు వాడడం, ఫీజులు పగిలిపోవడం వంటి జరుగుతుంటాయి. ఇలాంటి సమయంలో మాత్రమే ఆస్పత్రిలో కరెంటు కష్టాలొస్తున్నాయి. ఈతరుణంలో ఆస్పత్రి అన్ని విభాగాల్లో జనరేటర్ నుంచి విద్యుత్ సరఫరా కావడంలేదు. అసలు పలువిభాగాలకు ఈ జనరేటర్ నుంచి కనెక్షన్ ఇవ్వలేదని సిబ్బంది చెబుతున్నారు.

ఈదురుగాలుల వల్లే..



ఈదురు గాలులు వల్లే శనివారం కరెంటు సరఫరాలో అంతరాయం వచ్చింది. అప్పటికే సిబ్బంది సంఘటన స్థలికి పంపించి మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకున్నాం. అదే ఫీడర్‌లోనే జనరేటర్ కనెక్షన్ ఉంది. అందువల్లే శనివారం కరెంటు సమస్య ఎదురైంది. ఇకపై అలాంటివి జరగకుండా ముందు జాగ్రత్త పడుతాం. మిలిగిన విభాగాలను పరిశీలించి ఇబ్బంది లేకుండా చూస్తాం.

–డాక్టర్ అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి

వేడుకగా అర్జున తపస్సు


తపస్సుమాను ఎక్కిన అర్జున వేషధారి

గుడిపాల: వసంతాపురం వద్ద ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయం వద్ద ఆదివారం అర్జున తపస్సు వేడుకగా నిర్వహించారు. నిర్వాహకులు తపస్మానుకు పూజలు చేసి తీసుకువచ్చారు. నంతరం అర్జున వేషధా మెట్టు మెట్టుకు ఒక్కోపాటి పాడుతూ తపస్సు మానుపైకి ఎక్కారు. పైనుంచి పూజ వస్తువులను కిందికి జారవిడిచారు. వాటిని అందుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. అనంతరం వసంతాపురం యూత్ ఆధ్వర్యంలో వచ్చిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఇంద్రవరదుని ఆలయంలో ప్రత్యేక పుష్పాలంకరణ


వివిధ రకాల పుష్పాలతో సుందరంగా ముస్తాబైన ఆలయం


మజ్జిగ పంపిణీ చేస్తున్న యూత్ సభ్యులు

యాదమరి: మండల కేంద్రంలో వెలసిన ఇంద్రవరదుని ఆలయంలో ఉభయదారులు సుగంధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి రథోత్సవం సందర్భంగా ఆదివారం యాదమరికి చెందిన లేట్ ఏకాంబరం శెట్టి కుమారులు ఆలయంలో సుగంధ పుష్పాలతో అలంకరించడంతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మూలస్థానంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదునికి ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. రథోత్సవం సందర్భంగా స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు గ్రామస్తులు, అయ్యప్పస్వామి భక్తబృందం, యూత్ సభ్యులు అన్నదానం, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు.